ప్రజల మాట ప్రగతి బాట

బెల్లంపల్లి నియోజకవర్గం

# కార్యకర్తలే బలం, బలగం

- బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి
- ఎంపీ, బెల్లంపల్లి ఇన్‌చార్జి వెంకటేశ్ నేతకాని
- పేదోడికి, కోట్లాది రూపాయల వ్యాపారి మధ్య జరుగుతున్న ఎన్నికలివి
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కొండాపూర్ యాపలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం




కాసిపేట : బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, నవంబర్ 2 : బీఆర్ఎస్ కార్యకర్తలే బలం, బలగమని, కలిసికట్టుగా బీఆర్ఎస్ విజయానికి కృషి చేసి, మూడో సారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీసుకురావాలని పెద్దపల్లి ఎంపీ, బెల్లంపల్లి ఇన్‌చార్జి వెంకటేశ్ నేతకాని పిలుపునిచ్చారు. గురువారం కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి కార్యకర్త, నాయకులకు అండదండగా ఉంటామని, కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ఉండి మూడో సారి తెలంగాణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కేసీఆర్‌ను మరోసారి సీఎం చేసేందుకు కీలక పాత్ర పోషించాలని, బెల్లంపల్లి ఎమ్మెల్యేగా దుర్గం చిన్నయ్యను గెలిపించాలని కోరారు. కాసిపేట గులాబీ దండు ముందుండి బెల్లంపల్లిలో చిన్నన్నను మరో సారి అసెంబ్లీకి పంపాలన్నారు. సర్వే ప్రకారం 76 సీట్లలో గులాబీ జెండాను ఎగురవేస్తామని వస్తుందని, ముచ్చటగా సీఎం కేసీఆర్ మూడో సారి సీఎం అవుతున్నారని సర్వేలు తెలుపుతున్నాయని, గులాబీ దండు సైనికులు వంద సీట్లలో గులాబీ జెండా ఎగురవేయాలని, ఇందుకు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కీలక పాత్ర పోషించాలని కోరారు.



కాసిపేట : హాజరైన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు

**పేదోడికి, కోట్లది రూపాయాల వ్యాపారి మధ్య సంగ్రామం**
**- బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఒక పేదవాడికి, రైతు బిడ్డకు, కోట్లాది రూపాయల వ్యాపారికి మధ్య జరుగుతున్న ఎన్నికల సంగ్రామమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. గత ఎన్నికల్లో గెలిచేందుకు కోట్లాది రూపాయాలు ఖర్చుపెట్టినా ఓడిపోయారని, ఆ తర్వాత పత్తాలేకుండా పోయి డబ్బుల సంచులతో మళ్లీ ఎన్నికల సమయంలో వచ్చాడన్నారు. ఇలాంటి వారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి సేవ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా మూడో సారి గెలిపించి పేదోడికి పట్టం కట్టాలని కోరారు. తెలంగాణలో ఎన్నో చేస్తామని హామీలు ఇస్తున్న కాంగ్రెస్, అధికారంలో ఉన్న కర్ణాటకలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని బీఆర్ఎస్ కార్యకర్తలను కోరారు. అనంతరం 60 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, సహకార చైర్మన్ నీలా రాంచందర్, రైతు బంధు అధ్యక్షుడు దుర్గం పోశం, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాపాట్ శంకర్, ఓసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అప్పాల శేఖర్, మంజులారెడ్డి, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, సర్పంచులు ఆడె బాదు, ఆడె జంగు, దేవి, భూక్యా సునీత, అజ్మీరా తిరుపతి, రాంటెంకి శ్రీనివాస్, నాయకులు మడావి అనంతరావు, అట్టెపల్లి శ్రీనివాస్, అగ్గి సత్తయ్య, జాడి రాంచందర్, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి హ్యాట్రిక్ సాధించడం ఖాయం**

బెల్లంపల్లి, నవంబర్ 2:బెల్లంపల్లి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య ధీమా వ్యక్తం చేశారు. తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ రౌతు వెంకటేశం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలే తనను అధిక మెజార్టీతో గెలిపిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ పార్టీలో చేరికలు**

భీమిని, నవంబర్ 2 : మండలంలోని వీగాం గ్రామానికి చెందిన పలువురు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బక్కగాండ్ల రాజయ్య, కారెం సంతోష్, గుజ్జ అంజన్న, గుజ్జ సంతోష్, శేఖర్ పార్టీలో చేరారు. వీరికి బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, మహేశ్‌గౌడ్, గాండ్ల నానయ్య తదితరులు పాల్గొన్నారు.

**గెలుపే లక్ష్యం : సోమగూడెం కార్యకర్తలు, నాయకులు**

కాసిపేట, నవంబర్ 2 : బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేసి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను మూడో సారి గెలుపించుకునే లక్ష్యంతో పని చేస్తామని సోమగూడెం బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు స్పష్టం చేశారు. గురువారం బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమావేశమయ్యారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు హాజరు కాగా తమ సమస్యలను వివరించారు. గతంలో అనేక అభివృద్ధి పనులు చేసుకున్నామని, మరిన్ని అభివృద్ధి పనులు చేసుకుందామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో పాటు బీఆర్ఎస్ పెద్ద కుటుంబమని, కొన్ని మనస్పర్థలు ఉంటే ఒకే కుటుంబంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. ఐకమత్యంగా ఉండి బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుంటామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్, నాయకులు వొడ్నాల రాజన్న, కొమ్మెర లక్షణ్, పొట్లపల్లి సుభాష్‌రావు, గ్రామ అధ్యక్షుడు బైరగోని సిద్ధయ్య, నాయకులు అచ్చె భాగ్యలక్ష్మి జాడి ప్రమీలా, దుర్గం గోపాల్, రంగు రవి తేజ, జాడి శివ, కుక్క రాంచందర్, మాడ గోపాల్, కొయ్యాడ శ్రీనివాస్, రావుల సతీశ్, ఉస్కమల్ల వివేక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కాసిపేట : ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు మద్దతుగా నినాదాలు చేస్తున్న సోమగూడెం నాయకులు, కార్యకర్తలు



భీమిని : బీఆర్ఎస్‌లో చేరిన వారితో మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా



బెల్లంపల్లి : ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను కలిసిన బోయపల్లి ప్రజాప్రతినిధులు

## ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వాహనం తనిఖీ



ఎమ్మెల్యే వాహనాన్ని చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

కాసిపేట, నవంబర్ 2 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం సమీపంలో టోల్‌గేట్ సమీపంలోని పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాసిపేటకు వెళ్లారు.

## సీఎం సభాస్థలి పరిశీలన

బెల్లంపల్లి, నవంబర్ 2: సీఎం కేసీఆర్ ఈ నెల 8న బెల్లంపల్లికి రానున్నారు. తిలక్‌స్టేడియంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. గురువారం అందుకు తగిన సభాస్థలిని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరిశీలించారు. తిలక్‌స్టేడియంలో ఏర్పాటు చేసే భారీ స్టేజీ, ఇతర గ్యాలరీలను ఏర్పాటు చేసే వాటిపై పలు సూచనలు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీఎం సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిలువేరు నర్సింగం, మాజీ ఎంపీపీ పొట్లపల్లి సుభాష్ రావు, పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



సీఎం కేసీఆర్ సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బీ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి

వేమనపల్లి, నవంబర్ 2 : ప్రజలందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి మండలంలోని సుంపుటం, వేమనపల్లి, జాజులపేట గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. వంద శాతం పోలింగ్ జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అనంతరం రామగుండం సీపీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తప్పకుండా ఓటు వేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీలు జాజులపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. వేమనపల్లి ప్రాణహిత నది ఫెర్రీ పాయింట్లను పరిశీలించారు. ప్రాణహిత నదిలో పడవలు నడిపే వారికి ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ సదానందం, ఎంపీవో శ్రీపతి బాపురావు, జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, నీల్వాయి ఎస్ఐ సుబ్బారావు, ఆర్ఐ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు పోచం, సీరజ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల పెంపకంపై రైతులకు శిక్షణ

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 2: బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రంలో గురువారం రైతులకు చేపల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ ప్రారంభించారు. ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా వచ్చిన మత్స్య విభాగపు అధికారి డాక్టర్ భవ్యశ్రీ చేపల పెంపకం వల్ల ప్రభుత్వ పథకాలు పొందే విధానాలు, చేపల ఆధారిత ఉత్పత్తుల మీద రైతులకు శిక్షణ అందించారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 25 మంది రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

## కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

కాసిపేట, నవంబర్ 2 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో కోరం లేక సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ఎంఏ అలీం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీవో నాగరాజు, సర్పంచ్ అప్పని స్వరూప, ఏవో దేవులపల్లి వందన, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, విద్యుత్ ఏఈ స్వర్ణలత, సీసీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 2: బెల్లంపల్లి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో గురువారం తనిఖీ చేస్తుండగా కాసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సిరిగిరి మహేశ్ వద్ద రూ.2700 విలువైన అక్రమ మద్యం బాటిళ్లు లభించినట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. అతన్ని విచారించగా తన ఇంట్లో నడుపుతున్న బెల్ట్‌షాపునకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. పంచనామా నిర్వహించి సిరిగిరి మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## ఓసీలో బోల్తా పడిన వోల్వో...

కాసిపేట, నవంబర్ 2 : మందమర్రి ఏరియాలోని కల్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో గురువారం ఉదయంవోల్వో ట్రక్ ఓబీ(మట్టి)ని తరలిస్తున్న క్రమంలో మూల మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలతో బయట పడ్డాడు.